పొగాకు వాడకంతో దుష్పరిణామాలు


మడకశిరలోని వైఎస్సార్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు


రొళ్ల బస్టాండ్ ఆవరణలో విద్యార్థుల మానవహారం

మడకశిర: పట్టణంలో గురువారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పొగాకు వాడడం వలన కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులు పాఠశాల నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. పొగాకు ఆరోగ్యానికి చేటు అని ప్రజలకు అవగాహన కల్పించారు. పొగాకు తిని క్యాన్సర్ తదితర వ్యాధులకు లోనుకావద్దని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం శిరీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రొళ్ల: అంతర్జాతీయ పొగాకు నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ సర్కిల్ ఆవరణలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఎంఈఓ శ్రీధర్, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యంజారప్ప, హెచ్ఎం డి.రవికృష్ణ, ఉపాధ్యాయులు, సీఆర్పీ గిరిష్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడిబండ: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వరకు విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు ర్యాలీగా వెళ్లి మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో హెచ్ఎం గోవిందప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● అయ్యో.. పాపం


పాడుబడ్డ ఇంట్లో నివాసముంటున్న అన్నా చెల్లెలు

పావగడ: పట్టణంలోని కావలగేరి వీధిలో ఎండ, వాన, చలిని భరిస్తూ కాలం గడుపుతున్న ఓ అన్నా చెల్లెలు విషాద గాథ ఇది. అన్న రామాంజనేయ(50) ప్రైవేటు బస్సు క్లీనర్‌గా పని చేస్తూ చెల్లెలు సీతాలక్ష్మి(46)ని పోషిస్తున్నాడు. వారు ఉంటున్న ఇల్లు పూర్తిగా దెబ్బ తినడంతో.. ఎప్పుడేం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ నివసిస్తున్నారు. ఇంటి రాళ్లు కిందకు పడిపోవడంతో పాములు, తేళ్ల బెడద ఎక్కువైందని, ప్రభుత్వం అందించే బియ్యంతో అన్నం వండుకుని కాలం గడుపుతున్నామని అన్నా చెల్లెలు కన్నీటి పర్యంతమయ్యారు. తమకు నివసించడానికి ఇల్లు నిర్మించి ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్ చొరవ తీసుకుని ఆ అభాగ్యులకు ఇల్లు నిర్మించి ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మెడికల్ కళాశాల పరిశీలన

పెనుకొండ: పట్టణంలోని షీఫారం వద్ద ఉన్న మెడికల్ కళాశాలను బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖామాత్యులు సవిత గురువారం పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ పనులు పునాదుల దశలోనే నిలిచిపోయాయన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 27 మెడికల్ కళాశాలలను నిర్మించారన్నారు. టీడీపీ హయాంలోనే రాష్ట్రంలో వైద్య విద్య వృద్ధి చెందిందన్నారు. అనంతపురంలో బుధవారం నిర్వహించిన సూపర్‌సిక్స్, సూపర్‌హిట్ సభ మెగా హిట్ అయ్యిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేస్తున్నట్లు మంత్రి వివరించారు.

ఘనంగా మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు


ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న వేణురెడ్డి తదితరులు


ఆమిదాలగొంది వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చిలమత్తూరు: హిందూపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, పబ్లిసిటీ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్‌రెడ్డి, శ్రీరామిరెడ్డి, కౌన్సిలర్ షాజియా, పార్టీ నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మడకశిరరూరల్: మండలంలోని ఆమిదాలగొంది వృద్ధాశ్రమంలో గురువారం మడకశిర నగర పంచాయతీ మాజీ చైర్‌పర్సన్ తనయుడు జయరాజ్ ఆధ్వర్యంలో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు, స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సతీష్ కుమార్, కౌన్సిలర్లు అన్సర్‌ఖాన్, శ్రీనివాసులు, కోఆప్షన్ సభ్యుడు ఫక్రుద్దీన్, కమిటీ సభ్యులు ఓంకార్, సుధీర్‌రెడ్డి, మధు, నరసింహప్ప, నవీన్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: పట్టణంలో గురువారం రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్‌కట్ చేసి స్వీట్లను పంచి పెట్టారు. వేడుకల్లో గుడిబండ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు, నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు శేషాద్రి, పంచాయతీ అధ్యక్షుడు వైసీ బాలకృష్ణారెడ్డి, మడకశిర టౌన్ జనరల్ సెక్రటరీ బాలురెడ్డి, ఈసీ మెంబర్ అక్కంపల్లి నాగభూషణ్‌రెడ్డి, మెళవాయి సర్పంచ్ రంగనాథ్, మనూర్ సర్పంచ్ తిమ్మారెడ్డి, ఆమిదాలగొంది సర్పంచ్ అంజనమూర్తి, నాయకులు న్యాయవాది అశ్వత్థనారాయణ, జిల్లెడుగుంట మంజునాథ్, నాగభూషణ్‌రెడ్డి, టీడీపల్లి రంగనాథ్, జబ్బర్, మంజు, హరేసముద్రం లక్ష్మీనారాయణ, గుండుమల నాగేష్, మడకశిర టౌన్ ధను తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక పోటీలకు సహకారం అందించండి

హిందూపురం: రాష్ట్ర స్థాయి ఏడో రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక పోటీలకు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ చేతన్, జేసీ అభిషేక్ కుమార్‌ను కోరినట్లు జిల్లా కార్యదర్శి మైనుద్దీన్ గురువారం తెలిపారు. ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ వెంకట రాజేష్ ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక పోటీలు-2025పై వివరించారు. ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించి ఉమ్మడి అనంతపురం జిల్లాలో జరిగే రెవెన్యూ స్పోర్ట్స్ మీట్‌కు తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమం జిల్లా అధ్యక్షుడు మధునాయక్, సెక్రెటరీ మైనుద్దీన్, డివిజన్ సెక్రెటరీ యస్వంత్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు తలారి పెద్దయ్య, ఆర్గనైజేషన్ సెక్రెటరీ ప్రసాద్, అనంతపురం సెక్రటరీ నారాయణ స్వామి, గుంతకల్లు అధ్యక్షుడు రాజ్‌కుమార్, కార్యదర్శి ఆది, నాగేంద్ర, అక్రమ్, షాకీర్ తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో భేటీ


ఈరలక్కప్పను సన్మానిస్తున్న రామచంద్రారెడ్డి

మడకశిర: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప గురువారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారు నియోజకవర్గంలో పార్టీ బలోపేతం చేయాలని సూచించినట్లు తెలిపారు.

మద్యం షాపు మార్చాలని ఆర్డీఓకు వినతి


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రొద్దం: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మద్యం షాపున మార్చాలని బహుజన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ కోరారు. ఈమేరకు గురువారం ఆయన ఆర్డీఓ అనంద్‌కుమార్ వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వేదిక నాయకులు మాట్లాడుతూ మందుబాబులు మద్యం మత్తులో అంబేడ్కర విగ్రహ పరిసరాలను అపవిత్రం చేస్తున్నారన్నారు. పది రోజుల లోపు మద్యం షాపును మార్చకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పెనుకొండ నియోజకవర్గ కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి నాయకులు ఎంవీ రమణ, రొద్దం మండల దళిత సంఘం నాయకులు నరేష్, బాబుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి


నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

పెనుకొండ: ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు పట్టణంలో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో గురువారం సమస్యలపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ బార్ కౌన్సిల్ అడ్వొకేట్ వెల్ఫేర్ డెత్ బెనిఫిట్‌ను రూ.10 లక్షలకు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదులందరికీ ఉచిత ఆరోగ్యబీమా కార్డులు ఇవ్వాలన్నారు. మరణించిన న్యాయవాదులకు మ్యాచింగ్ గ్రాంట్ రూ.4 లక్షలు వెంటనే చెల్లించాలని, న్యాయవాదులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మదన్ మోహన్‌రెడ్డి, ఏజీపీ భాస్కర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు శివారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అశ్వర్థనారాయణ, నాగార్జున, విశ్వనాథ్, ఆసిఫ్, షన్వాజ్, రాజ్‌కమల్, శ్రీరాములు, రాజేష్ నాయక్ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ సరికాదు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రాజకీయ పార్టీల ఐక్యవేదిక నాయకులు

హిందూపురం: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయం సరికాదని రాజకీయ పార్టీల ఐక్యవేదిక నాయకులు అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఐక్య వేదిక నాయకులు శ్రీనివాసులు మాట్లాడుతూ పేద మధ్యతరగతి విద్యార్థులు డాక్టర్లు కావాలన్న ఆశలను అడియాశలు చేయవద్దని ప్రభుత్వాన్ని కోరారు. గత 9న కూటమి ప్రభుత్వం కేబినెట్‌లో రాష్ట్రంలోని 10 మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పబ్లిక్ పార్ట్‌నర్‌షిప్ పేరిట ప్రైవేట్‌కు అప్పగించే నిర్ణయం సరికాదన్నారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీ ఐక్య వేదిక నాయకులు అమానుల్లా, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బాబావలి, ఎస్‌యూసీఐ నాయకుల రంగనాయకులు, దళిత సమైక్య నాయకులు నారాయణ, మూర్తి పాల్గొన్నారు.

దేదీప్యమానం.. వినాయక నిమజ్జనం


బాణ సంచా వెలుగులతో సాగుతున్న ఊరేగింపు

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట గ్రామంలో హిందూ మహా గణపతి నిమజ్జనం బాణ సంచా కాంతులతో గురువారం సాయంత్రం దేదీప్యమానంగా జరిగింది. స్థానిక బస్టాండ్ వద్ద ప్రతిష్టించిన హిందూ మహా గణపతిని పోలీస్ బందోబస్తు మధ్య వందలాది మంది భక్తులు వెంట రాగా భారీ ఊరేగింపు సాగింది. యువకులు డ్రమ్ సెట్ల వాయిద్యాలకు అనుగుణంగా నృత్యం చేశారు. మసీదు వద్ద ముస్లిం నాయకులు భక్తులకు మిఠాయిలను పంపిణీ చేశారు. గ్రామం వెలువల బురుగుంటయ్య కుంట లో వినాయక నిమజ్జనం నిర్వహించారు.

గణేష్ నిమజ్జనోత్సవానికి తరలిరండి

అమరాపురం: అమరాపురంలోని వినాయక నగర్‌లో ఈ నెల 13న హిందూ మహా గణపతి నిమజ్జనోత్సవానికి భక్తులు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని శ్రీ వరసిద్ధి వినాయక కమిటీ సభ్యులు గురువారం సాయంత్రం బైక్ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని తమ్మడేపల్లి, వలస, గొడనకుంట, విరుపసముద్రం, వి. అగ్రహారం, పుల్లీకుంట, వీరాపురం, నగోనపల్లి, దేవగానపల్లి, మద్దనకుంట, ఉదుగూరు, హేమావతి తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తూ స్వామి వారి నిమజ్జనానికి తరలి రావాలని కమిటీ సభ్యులు కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్ఎస్‌పీఆర్ విద్యార్థులు


విద్యార్థినులకు సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

హిందూపురం టౌన్: ఉమ్మడి జిల్లాల ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్వహించిన జిల్లా స్థాయి ఐదు కిలోమీటర్ల మారథాన్‌లో ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన తృతీయ సంవత్సరం బీకాం విద్యార్థిని పీ.రాధిక, ద్వితీయ సంవత్సరం బీకాం విద్యార్థిని యూ.పల్లవిని అభినందించారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో రెండింటిలోనూ తమ కళాశాల విద్యార్థినులు నిలిచి, విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేసులు, ఎన్ఎస్ఎస్ పీఓ రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు, ఫిజికల్ డైరెక్టర్ విజయలక్ష్మీ, సిబ్బంది విద్యార్థినులను అభినందించారు.

డంపింగ్ యార్డులో రీసైక్లింగ్ పనుల పరిశీలన


డంపింగ్ యార్డులో పనులను పరిశీలిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణ పరిధిలోని మోతుకుపల్లిలోని పురపాలక సంఘ డంపింగ్ యార్డులో చెత్త రీసైక్లింగ్ పనులను డీఈ రమేష్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పరిశీలించారు. కాంట్రాక్టర్‌తో ఇప్పటి వరకు పనులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కొంతకాలంగా పట్టణంలో సేకరించిన చెత్త మొత్తం మోతుకుపల్లి వద్ద ఉన్న డంపింగ్ యార్డ్‌కు తరలించినట్లు తెలిపారు. చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని, ప్రజలు భరించలేకపోతున్నారన్నారు. డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన తడి, పొడి చెత్తతో పాటు ఇనుము, విద్యుత్ సంబంధించిన వస్తువులను చెత్త యంత్రాల ద్వారా వేరు చేయనున్నట్లు తెలిపారు. డంపింగ్ యార్డ్‌లో మొత్తం చెత్తను రీసైక్లింగ్ ద్వారా శుభ్రం చేయడం జరుగుతుందన్నారు. మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దస్తగిరి, ఏఈ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలి


జెడ్పీటీసీకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

రొళ్ల: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్‌ను కేంద్ర ప్రభుత్వం రెన్యువల్ చేసి సంక్షేమ పథకాలు కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి వివిధ పంచాయతీ కేంద్రాల నుంచి మహిళలు, ఆర్డీటీ మహిళ సంఘాల సభ్యులు ప్రజలతో కలిసి ర్యాలీగా వచ్చారు. అనంతరం మహిళలు అనంతరాజుకు వినతి పత్రాన్ని అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు రంగనపల్లినాగేంద్ర, ఆర్డీటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మండలంలో భారీ వర్షం


మరవకొత్తపల్లి వద్ద పరవళ్లు తొక్కుతున్న కుషావతి నది

చిలమత్తూరు: మండలంలో బుధవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. దీంతో చెరువులు , కుంటలలోకి భారీగా నీరు వచ్చి చేరింది. మరో వైపు కర్ణాటకలో కురిసిన భారీ వర్షానికి చిత్రావతి, కుషావతి నదులు పరవళ్లు తొక్కాయి. వర్షాలు కొనసాగితే చెరువులు, కుంటలు పూర్తిగా నిండే అవకాశం ఉంది.

సామాజిక తనిఖీపై 'ప్రజావేదిక'

పెనుకొండ రూరల్: ఉపాధి హామీపై సామాజిక తనిఖీ కార్యక్రమంపై గురువారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రజావేదిక(బహిరంగ సభ) కార్యక్రమం ఏర్పాటు చేశారు. మండలంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 708 పనులను చేపట్టారు. ఇందుకుగాను రూ.11,45,64587 ఖర్చు చేశారు. అయితే ఇందులో రూ.49,708లు అక్రమాలు జరిగినట్లు తనిఖీ బృందం సభ్యులు నిగ్గుతేల్చారు. ఈ నిధులను బాధ్యుల నుంచి రికవరీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారి రమేష్ బాబు, ఎంపీడీవో నరేష్ కృష్ణ, విజిలెన్స్ అధికారి నాగేశ్వరరావు, ఎస్ఆర్పీ భాస్కర్, శివారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

డిపోలో సమస్యలు పరిష్కరించండి

మడకశిర: ఆర్టీసీ డిపోలో సమస్యలను పరిష్కరించాలని గురువారం నూతన ఎన్ఎంయూ కమిటీ సభ్యులు స్థానిక డీఎం రంగభాష్యంను కలిసి కోరారు. అంతేకాకుండా నూతన కమిటీ సభ్యుల వివరాలను డీఎంకు ఎన్ఎంయూ నాయకులు అందించారు. ప్రధానంగా డిపోలో ఉన్న సమస్యలు, ఆర్టీసీ కార్మికుల సమస్యలను డీఎంకు వివరించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు రామక్రిష్ణ, డిపో అధ్యక్షుడు ముద్దప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణ, కార్యదర్శి కరియప్ప, కోశాధికారి నాయక్, స్థానిక ఎన్ఎంయూ నాయకులు జయసింహ, పురుషోత్తం, గంగాధర్, సుదర్శన్, మారుతిప్రసాద్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థుల 'పారిశ్రామిక విజిట్'


ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌ను సందర్శించిన విద్యార్థులు

అగళి: స్థానిక ఆదర్శ పాఠశాలలోని 9,10,11,12వ తరగతి విద్యార్థులు ఒకేషనల్ కోర్సులు, బ్యూటీ అండ్ వెల్నెస్ ఐటీ చదువుతున్న విద్యార్థులు పారిశ్రామిక విజిట్‌లో భాగంగా బ్యూటీ పార్లర్లు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులను సందర్శించారని ప్రిన్సిపాల్ వేణు గోపాల్, ఒకేషనల్ కోర్స్ ఉపాధ్యాయురాలు నాగరత్నమ్మ, ఐటీ ఉపాధ్యాయుడు చంద్రబాబు తెలిపారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక


లోహిత్ కుమార్

లేపాక్షి: మండలంలోని కొండూరు జెడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతి విద్యార్థి లోహిత్‌కుమార్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం శేషగిరిబాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు శివకుమార్ గురువారం తెలిపారు. అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో ఈనెల 9న జరిగిన జిల్లా సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల 26, 27, 28 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఉత్తమ ఉపాధ్యాయులను ఏపీటీఎఫ్ నాయకులు, ఇతర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఇటీవల ఉపాధ్యాయులు నాగార్జున, చంద్రబాబు, అమీర్‌వలి, కేశప్ప జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాలు అందుకున్నారు. ఈసందర్భంగా వక్తలు ఉత్తమ అవార్డు గ్రహీతల సేవలను కొనియాడారు. అనంతరం వారిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఏపీటీఎఫ్ నాయకులు శ్రీనివాసులు, రఘునాథరావు, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ దినోత్సవం


విద్యార్థులతో ఉపాధ్యాయులు

పావగడ: తాలూకాలోని అరసికెరె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులకు కుండను కొట్టే పోటీలు, మ్యూజికల్ చైర్స్, పిరమిడ్ జోడించడం తదితర పోటీలను నిర్వహించారు. పోటీల్లో విజయం సాధించిన ఉపాధ్యాయులకు విద్యార్థులే బహుమతులందించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ఇటీవల మధుగిరి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రశస్తి పొందిన ఎన్ హనుమేశ్‌ను ఘనంగా సన్మానించారు.

సమన్వయకర్త దీపికకు సన్మానం


టీఎన్ దీపికను సన్మానిస్తున్న వరుణ్‌రెడ్డి

చిలమత్తూరు: హిందూపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక పార్టీ నేత టీడీ వరుణ్‌రెడ్డి తదితరులు గురువారం సన్మానించారు. కొల్లకుంట వైఎస్సార్‌సీపీ నేత టీడీ వరుణ్‌రెడ్డిని పార్టీ బూత్ కమిటీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమించిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా టీడీ వరుణ్‌రెడ్డి సమన్వయకర్త దీపికకు కృతజ్ఞతలు తెలియజేశారు. సమన్వయకర్త మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్‌రెడ్డి, నాయకులు వరుణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

15న మండల సర్వసభ్య సమావేశం

రొద్దం: ఈనెల 15న మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

యూరియా పంపిణీకి చర్యలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో యూరియా పంపిణీకి చర్యలు చేపట్టామని రైతులు ఆందోళన చెందవద్దని ఏఓ తిమ్మప్ప తెలిపారు. గురువారం కదిరేపల్లి, భక్తరపల్లి,ఆర్ ఆనంతపురం రైతు సేవా కేంద్రాల్లో రైతులకు యూరియాను పంపిణీ చేశామన్నారు. సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యాచకులకు ఆహారం వితరణ

హిందూపురం టౌన్: రెబల్ స్టార్ కృష్ణం రాజు వర్ధంతిని పురస్కరించుకుని హిందూపురం రెబల్ స్టార్ ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షుడు వెంకటేష్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం యాచకులకు ఆహారం వితరణ చేశారు. పట్టణంలోని ఆలయాల వద్ద, ప్రార్థనా మందిరాల వద్ద, రోడ్లుపై ఉన్న యాచకులకు ఆహారం అందించారు. కార్యక్రమంలో సాయిచరణ్, నితిన్, ప్రేమ్‌సాయి, రవికిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

పెనుకొండ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఏపీటీఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జి.గోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు ఎన్నికల అధికారి కోడూరు శ్రీనివాసులు రాష్ట్ర కౌన్సిలర్ రఘునాథరావు హాజరయ్యారు. మండల గౌరవాధ్యక్షుడిగా కష్ణమూర్తి, మండల అధ్యక్షుడిగా గోపాల్‌ను ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణనాయక్, జిల్లా కౌన్సిలర్లుగా రామాంజినేయులు, వెంకటేశులు, చంద్రశేఖర్, గోనుగుంట్ల మధు, రఘునాథ్, అరుణా దేవి, మల్లిక ఎన్నికయ్యారు. ఏపీటీఎఫ్ నాయకులు ఆంజనేయులు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో పెనుకొండ విద్యార్థుల ప్రదర్శన

పెనుకొండ: కాణిపాకం బ్రహ్మోత్సవాల్లో పెనుకొండకు చెందిన ప్రగతి గ్లోబల్‌జెన్ విద్యార్థులు తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. గురువారం పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థులు 9 పాటలకు నృత్యం చేశారు. నిర్వాహకులు విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ మధు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

పెనుకొండ రూరల్: ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరమని వక్తలు పేర్కొన్నారు. గుట్టూరు గ్రామంలో గురువారం టింబక్టు కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత న్యాయ సేవా సదస్సు ఏర్పాటు చేశారు. మహిళలు పని ప్రదేశాల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులపై నాటిక ప్రదర్శించారు. అనంతరం గృహహింస, మహిళా చట్టాలపై సిబ్బంది అవగాహన కల్పించారు. టింబక్టు సంస్థ సిబ్బంది కవిత, రమీజ, రవళి, గౌరి, తదితరలు పాల్గొన్నారు.

మండల మీట్ వాయిదా

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో గురువారం సాధారణ మండల సర్వసభ్య సమావేశం జరగాల్సి ఉండేది. సమావేశానికి ఎంపీపీతో కలిపి మొత్తం 11 మంది ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాల్సి ఉండగా కేవలం దొడ్డేరి ఎంపీటీసీగా ఉన్న ఎంపీపీ కవిత మాత్రమే హాజరయ్యారు. కోరం సభ్యులు లేక అధికారులు ఈ నెల 23వ తేదీకి సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేశారు.